# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 30 ఆదివారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 249

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD










## వడ్డీ రాయితీ గడువు పొడిగించాలి

వరుసగా రెండ్రోజులు పండగలతో ఇబ్బందులు

ఇప్పటికే వేయికోట్లకు పైగా పన్ను వసూళ్లు



# హిమాచల్ నుంచి విద్యుత్ కొనుగోళ్లు

**సిఎం సుఖ్వీందర్ సమక్షంలో ఎంవోయూ**

**నిరంతరంగా విద్యుత్ లభ్యతే కారణమన్న భట్టి**

సిమ్లా: తెలంగాణలో వేగంగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని అవసరమైన విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ మేరకు హిమాచల్‌తో ఒప్పందాన్ని చేసుకుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఛత్తీస్‌ఘడ్‌తో ఒప్పందం చేసుకోగా ఇప్పుడు హిమాచల్‌తో ప్రబుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ– 2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ భద్రతను పెంచుకునే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ఆర్థికంగా మేలైనది, స్వచ్ఛమైన విద్యుత్‌ను పొందేందుకు ఈ ఒప్పందం గొప్ప ముందడుగన్నారు. శనివారం ఆయన హిమాచల్ రాజధాని సిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖుతో సమావేశమైన భట్టి.. విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు జల విద్యుత్ వ్యయం తక్కువగా ఉంటుందని భట్టి అన్నారు.



## సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం

దేశంలో తెలంగాణలో మాత్రమే పంపిణీ

సన్నబియ్యంతో అదనంగా 2800 కోట్ల భారం

నేడు సిఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం

పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

## మయన్మార్‌లో వరుస భూకంపాలు

భూ ప్రకంపనలతో వణికిపోతున్న జనాలు

ఇప్పటికే వేయి దాటిన మృతుల సంఖ్య

ముమ్మరంగా సహాయక చర్యలు

భారత్ సాయం అందచేత...ఆపరేషన్ బ్రహ్మాగా నామకరణం





## గుడిమల్కాపూర్‌లో కాల్పులు

విచారణ చేపట్టిన పోలీసులు



## హైదరాబాద్‌లో లింక్ రోడ్ల నిర్మాణం

ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా నిర్మాణాలు

భూసేకరణకు వెనకాడకుండా రోడ్లు

అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

## అర్ధరాత్రి వరకు మెట్రో సర్వీసులు



ప్రస్తుతం ఆఖరి రైలు రాత్రి 11 గంటల వరకే అందుబాటులో ఉంటుందనే విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సమయాన్ని రాత్రి 11.45 గంటల వరకూ పొడిగిస్తున్నట్లు- ఎన్‌విఎస్ రెడ్డి ప్రకటించారు.

# కోర్టుకు వెళ్తారో... మోడీ కాళ్లు పట్టుకుంటారో మీ ఇష్టం.

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ముఖ్యమంత్రి అమలు చేయాల్సిందే.
- రిజర్వేషన్ల పెంపును ఆమోదించకపోతే.. కాంగ్రెస్, బిజెపి నేతలను గ్రామాల్లో తిరగనియ్యం.
- బీసీ బిల్లుల ఆమోదానికి కేంద్రంపై కాంగ్రెస్, బీజేపీలు ఒత్తిడి తేవాలి.
- గ్రామాల వారీగా కులాల వారీగా బీసీ జనాభా వివరాలు బయటపెట్టాలి.
- బీసీల జనాభాను తగ్గించి... ఓసీల జనాభాను పెంచిన కాంగ్రెస్ సర్కార్.
- ఇచ్చిన మాట ప్రకారం ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి.
- కామారెడ్డి బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్.




"రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకపోతే కాంగ్రెస్, బిజెపి నాయకులను గ్రామాల్లో తిరగనివ్వబోమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్ ఎక్కడైతే చేసిందో... అదే కామారెడ్డి వేదికగా డిక్లరేషన్ చేస్తున్నాం... మాట తప్పితే కాంగ్రెస్, బీజేపీ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వం. అవసరమైతే మేము కూడా ఢిల్లీ వస్తాం... బిజెపి పై పోరాటం చేస్తాం కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దు" అని సూచించారు. శనివారం తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో కామారెడ్డిలో నిర్వహించిన బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

**వేగుచుక్క న్యూస్, ప్రతినిధి కుంచె వెంకటేష్, (కామారెడ్డి) :**

"బీసీ బిల్లులు అసెంబ్లీ ఆమోదించిన తర్వాత చోటే భాయ్, బడే భాయ్ కి అప్పగించారనీ, కోర్టులకు వెళ్తారా... లేదా ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ కాళ్ల మీద పడతారా మాకు సంబంధం లేదు కానీ 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ప్రధానమంత్రి అపాయింట్మెంట్ ఇవ్వలేదు. తెలంగాణలో కంటే ఎక్కువ ఢిల్లీలోనే ఉండే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధానమంత్రి అపాయింట్మెంట్ ఎందుకు దొరకడం లేదు ? బీసీల విషయం వచ్చేసరికి ప్రధాని అపాయింట్మెంట్ ఎందుకు దొరకడం లేదు ?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు.

తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్ల తరహాలో తెలంగాణలో కూడా అమలు చేయడానికి ప్రధాని మోదీ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ. 4,500 కోట్లు ఖర్చు చేసి 2011లో నిర్వహించిన కులగణన నివేదికను ఎందుకు బయట పెట్టడం లేదంటే కాంగ్రెస్ వద్ద సమాధానం లేదని, రూ 4500 కోట్లు గంగలో పోశారు కానీ లెక్కలు అయితే బయటకు ఇవ్వలేదనీ విమర్శించారు. కులగణన చెయ్యబోమని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి బీసీలను వంచించిందనీ, తెలంగాణ చట్టసభలు ఆమోదిం చిన బీసీ బిల్లులను తక్షణమే పార్లమెంటు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులను ఆమోదిం చడానికి తెలంగాణ బిజెపి ఎంపీ లు పార్లమెంటులో గళమెత్తాలని సూచించారు.

రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర చట్టసభలు పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించడానికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బీసీ బిల్లుల స్థితిపై

మిగతా 2లో

వేగుచుక్క

# సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం

**సూర్యాపేట:** సన్నబియ్యం పంపిణీ రాష్ట్ర చరిత్రలో నిలిచి పోయే కార్యక్రమమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది రోజున ఇది ప్రారంభం కానుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఉగాది రోజు ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మొత్తం కేబినెట్, ఎంపీలు హాజరు కాబోతున్నారని తెలిపారు. ప్రతి కార్యకర్త కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాలని చెప్పారు. శనివారం మెల్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి, మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెల్లరేషన్ కార్డ్ దారులకు మూడు రంగుల కార్డ్... ఉన్నతులకు గ్రీన్ కార్డ్ అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. రాష్ట్రంలో 84శాతం జనాభాకు మేలు చేసే కార్యక్రమం చేపట్టబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉగాది రోజున ఆదివారం హుజూర్‌నగర్ వేదికగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి అర్హులందరికీ రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 30 లక్షల మందిని రేషన్‌కు అర్హులుగా గుర్తించబోతున్నట్లు వెల్లడించారు. పేదలకు త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు వంటి సరకుల్ని కూడా రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తామని చెప్పారు. దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ వల్ల రాష్ట్రంపై రూ.2,800 కోట్ల అదనపు భారం పడనుంది. ఆ భారాన్ని భరించాలని కేంద్రాన్ని కోరామని అన్నారు. దేశంలోనే పేదలకు సన్నబియ్యం అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించబోతున్నామని చెప్పారు. ప్రతి లబ్ధిదారుకు 6 కిలోల బియ్యం ఇస్తాం. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని కూడా తెలిపారు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరుంటే కార్డులేకపోయినా రేషన్ తీసుకోవచ్చన్నారు. నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇంత మంచి సంక్షేమ పథకాన్ని చూడలేదన్నారు. రేషన్‌కార్డుపై ప్రధాని ఫొటో గురించి ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు. కొత్తగా జారీచేసే వాటితో కలిపి రాష్ట్రంలో రేషన్‌కార్డుల సంఖ్య కోటికి, లబ్ధిదారులు 3.10 కోట్ల మంది అవుతారని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. సన్న బియ్యాన్ని రాష్ట్ర అవసరాలకే వాడతాం. ఎఫ్‌సీఐకి ఇవ్వం. దొడ్డు బియ్యం మాత్రమే ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

# వడ్డీ రాయితీ గడువు పొడిగించాలి

**హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 'వన్ –టైమ్ సెటిల్‌మెంట్'కు మరో రెండు రోజులే గడువు ఉంది. ఇప్పటికే వేయికోట్ల మేర పన్నులు వసూలైనట్లు పురపాలక శాఖ తెలిపింది. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ కారణంగా ప్రజలు పండగ బిజీలో ఉన్నారని, మరో వారం రోజుల పాటు పొడిగించాలని పలువురు కోరుతున్నారు. గడువును ఏప్రిల్ మొదటి వారం వరకు పొడిగించాలని పలుచోట్ల వినతులు అందిస్తున్నారు. తమకు కలిసిన నేతల ముందు వివరిస్తున్నారు. ఈ నెల 31 వరకు పన్ను బకాయిలు చెల్లిస్తే 90శాతం వడ్డీ రాయితీ ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించింది. జీహెచ్‌ఎంసీ తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీ ఇవ్వాలని పురపాలక శాఖ నిర్ణయించింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో ఆస్తిపన్ను వసూళ్లు రూ.వెయ్యి కోట్లు దాటిందని రాష్ట్ర పురపాలక శాఖ తెలిపింది. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కలిపి ఇప్పటివరకు రూ.1010 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలైనట్లు అధికారికంగా వెల్లడించింది. మార్చి 31 నాటికి ఆస్తిపన్ను బకాయిలపై 10 శాతం వడ్డీ చెల్లించిన వారికి ఓటీఎస్ వర్తిస్తుందని పురపాలకశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో మార్చి 30, 31న సెలువులైనప్పటికీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లించవచ్చని తెలిపింది. రెండు రోజుల్లో ఆస్తిపన్ను చెల్లించి వడ్డీపై 90శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలని పురపాలక శాఖ సూచించింది. ఈ రెండు రోజులు చెల్లింపులను తీసుకుంటామని అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

# గుడిమల్కాపూర్‌లో కాల్పులు

హైదరాబాద్: నగరంలో మళ్లీ కాల్పుల ఘటన గుడిమల్కాపూర్‌లో చోటుచేసుకుంది. దీంతో ఆప్రాంతవాసులు భయాందోళనకు లోనయ్యారు. ఆనం మీర్జా ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో వ్యాపారులు దుకాణాలు భారీగా ఏర్పాటు చేశారు. ఇద్దరు దుకాణాదారుల మధ్య ఓ విషయంలో వాగ్వాదం జరిగింది. ఘర్షణ తారాస్థాయికి చేరడంతో ఒక షాప్ కీపర్ గాలిలో కాల్పులు జరిపాడు. ఈ ఘటన జరగడంతో ఎక్స్‌పో చూడటానికి వచ్చిన సందర్శకులు అక్కడి నుంచి భయటకు పరుగులు తీశారు. కాల్పులు జరగడంతో ఆ ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం తెలియడంతో వెంటనే సంఘటన జరిగిన స్థలానికి పోలీసులు వచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. గాలిలో కాల్పులు జరిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు పోలీసులు నిర్ధరించారు. కాల్పుల ముందు అసలు ఏం జరిగిందనే విషయంపై పోలీసులు ఆరా తీశారు. కాల్పుల సంఘటనకు సబంధించి సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# నాగర్‌కర్నూల్ ర్యాగింగ్ కలకలం

నాగర్‌కర్నూల్: ర్యాగింగ్‌పై ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కొన్నిచోట్ల ర్యాగింగ్‌లకు పాల్పడుతూనే ఉన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఈ నెల 25న రాజస్థాన్‌కు చెందిన మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. అతని సెల్‌ఫోన్ తీసుకుని వీడియోలు సెండ్ చేసుకున్నారని అనంతరం తనపై దాడి చేశారని పోలీస్ స్టేషన్‌లో బాధిత విద్యార్థి ఫిర్యాదు చేశారు. ఈ ర్యాగింగ్ ఘటనపై కాలేజీ వైస్ ప్రిన్స్‌పాల్ సుగుణ స్పందించారు. ర్యాగింగ్ జరిగింది వాస్తవమేనని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. వచ్చేనెల 2న వారితో సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించామని, మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ప్రిన్స్‌పాల్ సుగుణ తెలిపారు. తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లా, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మూడు రోజుల క్రితం రాత్రి సమయంలో ఫస్టియర్ ఇయర్ విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. అతనిపై వికృత చేష్టలకు పాల్పడ్డారు. దీనిపై బాధిత విద్యార్థి కాలేజీ ప్రిన్స్‌పాల్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మెడికల్ కాలేజీల్లో చాలా వరకు జరుగుతున్నాయి. అయితే బయటకు రావడంలేదు. ఈ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థి ధైర్యం చేసి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన గోప్యంగా ఉంచేందుకు యత్నించినప్పటికీ.. వెలుగులోకి వచ్చింది. పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నారు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తనకు మెడికల్ కాలేజీ హాస్టల్‌కు తీసుకెళ్లి ర్యాగింగ్ చేశారని.. గోడ కుర్చీ వేయిం చడంతోపాటు.. లేని గ్యాస్ సిలిండర్‌ను ఉన్నట్లు ఫీలవుతూ మోయాలని అవహేళన చేసినట్లు తెలిపాడు. అయితే.. సీనియర్ల టాస్క్‌ను మధ్యలో ఆపేసినందుకు లెదర్ బెల్ట్‌తో దాడి చేశారని వెల్లడించాడు. ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో నోటి నుంచి రక్తం బయటకు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాదు.. మొబైల్ ఫోన్ లాక్కొని పర్సనల్ ఫోటోలు, వీడియోలు షేర్ చేసుకొని తనను బ్లాక్ మెయిల్ చేశారని విద్యార్థి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం సంచలనం సృష్టించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మెడికల్ కాలేజ్‌కు వెళ్లి ఆరా తీశారు.

# మొగల్తూరు, చెరుకుపల్లి హైస్కూల్స్ అభివృద్ధి

అమరావతి, గ్రామాల అభివృద్ధి స్వరూపం మార్చాలనే దృఢమైన సంకల్పంతో ఉప ముఖ్యమంత్రివ పవన్ కళ్యాణ్ చొరవతో ఈ నెల 28వ తేదీన మొగల్తూరు, పెనుగొండ గ్రామాల్లో చేపట్టిన గ్రామ అభివృద్ధి సభల ప్రతిఫలాలు వెంటనే కనిపిస్తున్నాయి. రెండు సభల్లోనూ గ్రామస్థులు పాఠశాలలను బాగు చేయాలని కోరారు. దీనికి సంబంధించి అధికారులకు వినతులు అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కుపవన్ కళ్యాణ్ మొగల్తూరు, చెరుకుపల్లి హైస్కూల్స్ అభివృద్ధి అంశం తెలియచేశారు. నారా లోకేష్ దిశా నిర్దేశంతో అధికారులు సత్వరం స్పందించారు. మొగల్తూరు జడ్పీ హైస్కూలు సమగ్ర అభివృద్ధికి రూ.1.71 కోట్లు–, పెనుగొండ మండలం, చెరుకువాడ జడ్పీ హైస్కూలు అభివృద్ధి కోసం రూ.1.49 కోట్లతో విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అభివృద్ధి సభలో పాఠశాలలను బాగు చేయాలని ప్రజల నుంచి వినతులు అందిన వెంటనే 'మన బడి – మన భవిష్యత్తు' కార్యక్రమం కింద విద్యా శాఖ అధికారులు రెండు పాఠశాలలను సందర్శించి, అక్కడ పెండింగ్ లో ఉన్న పనులు, కావాల్సిన సౌకర్యాలను గుర్తించారు. దీనికి సంబంధించి వెనువెంటనే ఆయా పనులకు ఎంత మేర నిధులు అవసరమవుతాయో ప్రతిపాదనలు సిద్ధం చేసి, నివేదికలు పంపారు. త్వరలోనే ఈ రెండు పాఠశాలల్లోనూ అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి.

నరసాపురం ఎమ్మెల్యే శ్రీ బొమ్మిడి నాయకర్ గారు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఈ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకరించనున్నారు.

# మయన్మార్‌లో వరుస భూకంపాలు



న్యూఢిల్లీ:మయన్మార్, థాయ్‌లాండ్‌లో సంభవించిన భూకంపం తీవ్ర విషాదాన్ని మిగలల్చింది. మయన్మార్‌లో మరోమారు శనివారం భూకంపం సంభవించడంతో ప్రజలు వణికిపోయారు. ఇప్పటి వరకు భూకంపంతో 1600మందికి పైగా మృతి చెందినట్లు తెలుస్తోంది. మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలను శుక్రవారం రెండు అత్యంత శక్తిమంతమైన భూకంపాలు కుదిపేసిన విషయం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే చోటు చేసుకున్న భూ ప్రకంపనలతో మయన్మార్, థాయ్ దేశాలు వణికిపోయాయి. రోడ్లు, వంతెనలు, ఎయిర్‌పోర్ట్‌లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ విపత్తులో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ముఖ్యంగా మయన్మార్ ఈ విపత్తుకు తీవ్రంగా ప్రభావితమైంది. మృతుల సంఖ్య కూడా అక్కడ భారీగానే ఉంది. తాజా సమాచారం ప్రకారం రెండు దేశాల్లో భూకంపం కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 1,000 దాటింది. మయన్మార్‌లో కనీసం 1002 మంది మరణించినట్లు మయన్మార్ మిలిటరీ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. మరో, 2376 మంది గాయపడినట్లు పేర్కొన్నారు. శిథిలాల కింద వందల మంది చిక్కుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర సహాయ చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. శిథిలాల తొలగింపు తరవాత మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. బ్యాంకాక్ లో 10 మంది మరణించగా.. ఓ భారీ భవంతి కూలిన ఘటనలో దాదాపు 100 మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. అయితే రెండు దేశాల్లో మరణాల సంఖ్య 10 వేలు దాటే అవకాశం ఉన్నదని అమెరికా ఏజెన్సీ అంచనావేసింది. భూకంపం కారంణంగా కూలిన 30 అంతస్థుల భవంతి కింద మరో 43 మంది చిక్కుకుపోయారు. వీరిని వెలికి తీసేందుకు సహాయకచర్యలు జరుగుతున్నాయి. అయితే మయన్మార్‌లో భూకంపం సంభవించిన వెంటనే ప్రధాన నరేంద్ర మోదీ ఆ దేశాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే భారత్ నుంచి ఆ దేశానికి సహాయపు సామాగ్రిని విమానంలో పంపించారు. భూవిలయంతో వణికిపోయిన మయన్మార్‌ను తాజాగా మరిన్ని ప్రకంపనలు కలవరపెడుతున్నాయి. శుక్రవారం అత్యంత తీవ్రతతో పలుసార్లు కంపించగా.. శనివారం కూడా ప్రకంపనలు వస్తున్నాయి. ఉదయం 11.53 సమయంలో 4.3తీవ్రతతో భూమి కంపించింది. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత 3.8 తీవ్రతతో ఒకసారి, తాజాగా 2.50 గంటల సమయంలో 4.7 తీవ్రతతో మరోసారి ప్రకంపనలు వచ్చినట్లు– భారత్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ వెల్లడించింది. భూకంప బాధిత దేశాన్ని ఆదుకునేందుకు అంతర్జాతీయ సమాజం తమవంతు సాయాన్ని పంపిస్తున్న సమయంలో తాజా ప్రకంపనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మయన్మార్‌లోని ఓ ప్రాంతంలో భూకంపం తర్వాత భూమిలో నుంచి నీళ్లు ఉబికి వస్తుండటం విస్మయానికి గురిచేసింది. ఒక్కోసారి వందల అడుగులు బోరు వేసినా దొరకని నీళ్లు భూకంపం దెబ్బకు పొంగుకుంటూ వస్తున్నాయని ఈ వీడియో చూసిన వాళ్లంతా నోరెళ్లబెట్టారు. అయితే.. భూకంపం వల్ల వాటర్ లైన్స్ పగిలిపోయి ఇలా అయి ఉండొచ్చని.. అంతేతప్ప ఇవి భూమి లోపల నుంచి వస్తున్న నీళ్లు కావని ఎక్కువ మంది నెటిజన్లు అభిప్రాయపడ్డారు. భూ ఫలకాల్లో మార్పులు సంభవించినప్పుడల్లా భూకంపాలు సంభవిస్తుంటాయి. నేపాల్,

టిబెట్, భూటాన్, చైనాలోని ఎత్తైన ప్రాంతాలపై దీని ప్రభావం ఉంటుంది. భవిష్యత్‌లోనూ భూకంప ప్రమాదాలు పొంచి ఉన్నాయని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. పలుచోట్ల ఎత్తైన ఆలయాలు, గోపురాలు కుప్పకూలాయి. మండాలెలో ఇర్రవడ్డీ నదిపై ఉన్న అతి పురాతన అవా బ్రిడ్జి కూలిపోయింది. ప్రకృతి విలయంతో వణికిన మయన్మార్, థాయ్‌లాండ్‌లను ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ముందుకొస్తున్నాయి. ఇప్పటికే భారత్.. 'ఆపరేషన్ బ్రహ్మ' కింద మయన్మార్‌కు 40 టన్నుల సహాయక సామగ్రిని పంపించింది. టెంట్లు, దుప్పట్లు–, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు ఆహార ప్యాకెట్లను అందించింది. 80 మంది ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని కూడా పంపించింది. అటు–అమెరికా, ఇండోనేషియా, చైనాలు కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి.

# హైదరాబాద్‌లో లింక్ రోడ్ల నిర్మాణం

**ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా నిర్మాణాలు**

**భూసేకరణకు వెనకాడకుండా రోడ్లు**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ల విస్తరణకు అవసరమైన చోట బూసేకరణ చేపట్టాలని, ధర ఎక్కువైనా వెనక్కి పోవద్దని అన్నారు. ఆయా రహదారుల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి సమయం కలిసి వచ్చేలా ఉండాలని, ఈ క్రమంలో అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజధాని నగరంతో పాటు హెచ్‌ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, ప్రజలు ఎటువంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో విశాల ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సీఎం అన్నారు. అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం స్పెషల్

సెక్రటరీ అజిత్ రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలక, పట్టణభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు

# కోర్టుకు వెళ్తారో... మోడీ కాళ్లు పట్టుకుంటారో మీ ఇష్టం.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేయాలని, ఈ బిల్లులను కేంద్రం ఆమోదించడంపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సమాధానం చెప్పాలని సూచించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా52 శాతం అని తేలిందని, కానీ కాంగ్రెస్ చేసిన కుల సర్వే ద్వారా బీసీల జనాభా తగ్గించి.. ఓసీల జనాభాను పెంచారని విమర్శించారు. గ్రామాల వారీగా కులాల వారీగా జనాభా లెక్కలు బయటపెట్టాలని, డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చిన నేపథ్యంలో






తెలంగాణలో రిజర్వేషన్లు 54 శాతం అమలవుతున్నాయని, అంటే సుప్రీం కోర్టు విధించిన 50 శాతం పరిమితి మించిన రీత్యా కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేశామని వివరించారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రనంద్, మాజీ జెడ్పీటిసి, బాజిరెడ్డి జగన్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మోహన్, మాజీ జెడ్పీటిసి రాజేశ్వర్ రావు , యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్ల శివ ప్రసాద్ ,

జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్ రావు, సంపత్ గౌడ్, నరాల సుధాకర్, చింత మహేష్, యునైటెడ్ ఫుల్ ఫ్రంట్ నాయకులు అలకుంట హరి, కొట్టాల యాదగిరి, ఎత్తరి మారయ్య, గోపు సదనందు, విజేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు

# ఆర్కిడ్స్" హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ.







**ఐఐటీ, నీట్, ఒలింపియాడ్ ఫౌండేషన్ పోటీల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు.**

**అభినందించిన పాఠశాల చైర్మన్ సి హెచ్. గోవర్ధన్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 29:**

పట్టణంలోని "ఆర్కిడ్స్" హై స్కూల్ విద్యార్థులు పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఐఐటీ, నీట్ , ఒలింపియాడ్ ఫౌండేషన్ పోటీల్లో విశేష రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఏకలవ్య అకాడమీ వార్షిక స్కూల్ అవార్డ్స్ మాదాపూర్, హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో "ఆర్కిడ్స్" విద్యార్థులు అపూర్వమైన ఘనతను సాధించారు. పాఠశాలకు చెందిన డి. సహస్ర (7వ తరగతి), మరియు డి. యోగిత (4వ తరగతి) రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించారు. అలాగే ఆర్. తమన్న (6వ తరగతి), జి. ప్రగ్యశ్రీ (9వ తరగతి), మరియు పి. సాయికృష్ణ ప్రియ (8వ తరగతి) మెడల్స్ గెలుచుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను స్వామి బోధామయానంద, అధ్యక్ష మహారాజ్, రామకృష్ణ మఠం, మరియు విజయ్ రంగినేని (మాజీ సీఈఓ, టెక్ మహీంద్రా, బిపిఓ) అందజేసి, విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంలో పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపల్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ మర్రి సదాశివ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు తల్లిదండ్రుల కృషిని అభినందించారునాణ్యతమైన విద్యను అందిస్తూ, విద్యార్థులను అకాడమిక్, పోటీ పరీక్షల విజయానికి ప్రోత్సహిస్తూ, ఆర్కిడ్స్ హై స్కూల్ విద్యారంగంలో కొత్త రికార్డులను నెలకొల్పుతోందన్నారు. ఆర్కిడ్స్ హై స్కూల్ భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దుతున్న సంస్థ అని పేర్కొన్నారు.

## "నవోదయ"కు విద్యార్థుల ఎంపిక అభినందనీయం.

**- సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, మార్చి 29:**

ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల విద్యార్థులు జవహార్ నవోదయకు ఎంపిక కావడం అభినందనీయమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. పాఠశాల నుండి నవోదయకు ఎంపికైన విద్యార్థులు వి. సాధ్వి, టి. శివాని లకు శనివారం ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, పోటీ పరీక్షలు విద్యార్థుల నైపుణ్యాలను మెరుగు పరుచుటకు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు వీరమల్లు ప్రశాంత్, తోట భోజరత్నం, ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు: కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 29**



: జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగు నామాది నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని అభిలషించారు. ఉగాది పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. ప్రస్తుత శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలు, ఆనందోత్సాహాలతో జీవనాలు వెళ్లదీయాలని ఆకాంక్షించారు.

# యువ వికాసం" పేరిట కాంగ్రెస్ నయా మోసం.



**హామీలు ఎగొట్టే నైజం కాంగ్రెస్ డిఎన్ఏలోనే ఉంది.**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ ఆగ్రహం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 29:**

"యువ వికాసం" పేరిట కాంగ్రెస్ నయా మోసానికి పాల్పడుతుందని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎగొట్టే నైజం కాంగ్రెస్ డిఎన్ఏలోనే ఉందనీ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడారు. ఇచ్చిన మాటపై నిలబడే తత్వం కాంగ్రెస్ డీఎన్ఏ లోనే లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ చెత్తబుట్టలో వేశారని ఆరోపించారు. 'రాజీవ్ యువ వికాస్'? పథకం పెద్ద మోసమని, గారడీ అంకెలతో మళ్లీ మోసం చేసిందన్నారు. రూ. 3 లక్షల 60 వేల కోట్ల బడ్జెట్లో రూ. 60వేల కోట్లు కమిషన్ల రూపంలో మాయమవుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలకు ముందు డిక్లరేషన్లను ప్రకటిస్తూ అన్ని వర్గాల ఓట్లను దండుకొన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ఆ డిక్లరేషన్లను చెత్తబుట్టలో పడేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ రోజు రైతులను మహిళలను, విద్యార్థులను, నిరుద్యోగులను యావత్ తెలంగాణ జనులను మోసం చేసిందనీ అన్నారు. గృహజ్యోతి వెలుగులు లేవు, రైతు భరోసా పైసల్ లేవు, ఇందిరమ్మ ఇండ్ల ఐదులక్షలు రాలే, ఇంటి జాగా జాడలేదు అని అన్నారు. చేయుత పింఛన్ పెరిగింది లేదు, యువ వికాసం - నయా మోసం అని తెలిపారు. మహాలక్ష్మీ - పథకం ప్రస్తావనే లేదు, పైసల్ ఎకౌంట్ల పడలేదు అని మండిపడ్డారు.

**కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ నిండా మోసాలు.**



గత ప్రభుత్వం గారడీ మాటలతో మోసం చేస్తే వీళ్ళు గారడీ అంకెలతో మోసం చేస్తున్నారు అని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. 17 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని, బడ్జె ట్ లో ఇందుకు సంబంధి ంచిన ప్రస్తావన లేదన్నారు. 10లక్షల మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ కుంటుపడిందని, ఆరోగ్య శాఖకు 8 శాతానికి బదులు 4 శాతం కేటాయించడంతో పేదలు వైద్యానికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.

**బీసీల సంఖ్యను తగ్గించారు.**

రాష్ట్రంలో 52 శాతం ఉన్న బీసీల సంఖ్యను కులగణన ద్వారా తగ్గించారని ధన్?పాల్? విమర్శించారు. రూ. 7 లక్షల కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిన విషయం స్వయానా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం? అధికారంలోకి రాగానే 16 నెలల కాలంలో రూ. లక్షా 60వేల కోట్లు అప్పు చేసిందని మండిపడ్డారు. మహిళా స్వశక్తికరణ మరియు మహాలక్ష్మి పథకం నిధులు ఎక్కడ? మహిళలని కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం ఏమి చేసింది? మహాలక్ష్మి పథకానికి గత బడ్జెట్లో ప్రస్తావన లేదు, తాజా బడ్జెట్లో కూడా ఈ పథకం పక్కకు పెట్టారు అని అన్నారు. అంబేద్కర్ అభయహస్త పథకం నిధులు ఎక్కడ? కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో అంబేద్కర్ అభయహస్తం పేరిట దళితులతో పాటు గిరిజనులకు సైతం రూ. 12 లక్షల ఆర్థికసాయాన్ని అందజేస్తామని ప్రకటించిందని, తాజాగా ప్రకటించిన బడ్జెట్ లో దాని ప్రస్తావనే లేదని తెలిపారు.
ప్రభుత్వం పింఛన్ పెంపుకు నిధులు ఎక్కడ అని అన్నారు. చేయూత పథకం కింద కాంగ్రెస్ పార్టీ నాలుగు వేలకు పెన్షన్ పెంచుతామన్నారు. కాంగ్రెస్ పెంచే వాగ్దానాల ప్రకారం 27 వేల కోట్లు అవసరం కానీ 14,861 కోట్లు మాత్రమే కేటాయించింది అన్నారు, కొత్తగా 10 లక్షల పింఛన్దారులకు పెన్షన్ ఎలా అందిస్తారో చెప్పాలని అని తెలిపారు.

**ఫీజు రీయింబర్సమెంట్ నిధులు ఎక్కడ?**

ఫీజు రీయింబర్సమెంట్ పథకాన్ని ప్రవేశపెట్టింది మేమె అని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ - బకాయిల తీర్చేందుకు నిధులు ఎక్కడ అని అన్నారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికేట్లు, హాల్ టికెట్లు ఇచ్చే విషయంలో ఎలా ఇబ్బందులు పెట్టాయో చూశాం అని తెలిపారు. కాంగ్రెస్ 15 శాతం బడ్జెట్ విద్యకు కేటాయిస్తామని చెప్పింది, కానీ కేవలం 6.7 శాతం మాత్రమే కేటాయించారన్నారు. రూ" 5 లక్షల విద్యాభరోసా కార్డు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ గురించి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మీనారాయణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాళం రాజు, మండల అధ్యక్షులు తారక్ వేణు, గడ్డం రాజు, ఆనందరావు, నాగరాజు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో " దర్బార్. "







**పాల్గొన్న పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య.**

**క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచన.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 29**

పోలీస్ సిబ్బంది సమస్యలను తెలుసుకోవడానికి పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య "దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో శనివారం ఏర్పాటు చేసిన ఆర్మ్డ్ రిజర్వ్ (మహిళలు, పురుషులు) సిబ్బందికి, హెూమ్ గార్డ్స్ (మహిళలు, పురుషులు) సిబ్బందికి గల సమస్యలు క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలకు సత్వర చర్యలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ, సిబ్బందికి ఎప్పుడు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరు మంచి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని అన్నారు. సమాజంలో పోలీసుకు మంచిపేరు తేవాలని అన్నారు. ఈ కార్యాక్రమంలో అదనపు పోలీస్ కమీషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, రిజర్వు ఇన్స్ పెక్టర్ సతీష్ (హెూమ్ గార్డ్స్), తిరుపతి (అడ్మిన్), ఆర్.ఎస్.ఐలు శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, దేవి సింగ్ శేషారావు, దత్తు, ఆఫీస్ సూపర్డెంట్లు, శంకర్, బషీర్ అహ్మద్ , వనజ రాణి, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు షకిల్ పాషా, సిబ్బంది హజరయ్యారు.

# బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద రాజకీయాలను ఎండగడదాం.

**తెలంగాణలో మతసామరస్యాన్ని కాపాడుకుందాం.**

**సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే. రమ పిలుపు.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 29:**

బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద రాజకీయాలను ఎండగడదాం, తెలంగాణలో మతసామరస్యాన్ని కాపాడుకుందాం అని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే. రమ పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ అర్బన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం కోటగల్లిలో గల పద్మశాలి భవన్ లో శనివారం జరిగింది. ముందుగా సుత్తి, కొడవలి జెండాను జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. రమ మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మతం పేరుతో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆదివాసీలపై, దళితులపై మైనారిటీలపై హింసాత్మక దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ దేశంలో పతనమవుతున్నదన్నారు. రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. శాసనసభ ఎన్నికల తర్వాత తెలంగాణలో ప్రజల మధ్య మతపరమైన విభేదాలు పెంచేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. మెజార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా అవకాశవాద వైఖరితో ఉంటున్నదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు.
సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచందర్ మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ బిజెపి విభజన రాజకీయాల ప్రమాదాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విస్మరిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలోని వామపక్ష పార్టీలు కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలను చైతన్యం చేయడానికి, మతసామరస్యాన్ని కాపాడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, లౌకికత్వం, సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ గడ్డమీద మతోన్మాదానికి చోటు లేదని చాటి చెప్పాల్సిన బాధ్యత తెలంగాణ పౌర సమాజం మీద ఉందన్నారు. ఆ వైపుగా ప్రజలను మరింత చైతన్యం చేస్తామన్నారు.

**అర్బన్ జిల్లా కార్యదర్శిగా వనమాల కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక.**

నిజామాబాద్ అర్బన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నిజామాబాద్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా వనమాల కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, బోధన్ డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు కే.గంగాధర్, బి.మల్లేష్, ఏ.రవీందర్, సీ.హెచ్ సాయన్న, డి.కిషన్, బి.మురళి మరియు వివిధ ప్రజాసంఘాల నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పరీక్షల ఫీజులను తగ్గించాలి.

**- పిడిఎస్ యు ఆధ్వర్యంలో ధర్నా.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 29:**

ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ మరియు బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజులను తగ్గించాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఛాంబర్ ముందు పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద విద్యార్థులు చదివే గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లో పరీక్షల ఫీజులు ఇష్టారీతిన పెంచడం సరైంది కాదని అన్నారు. ఎక్కువగా ఫీజులు నిర్ణయించడం వలన విద్యార్థులు కొందరు అప్పులు చేసి కడుతున్నారని, మరికొందరు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని, ఒక్కొక్క బ్యాక్ లాగ్ సబ్జెక్టుకు 700 రూపాయలు తీసుకుంటున్నారని అన్నారు. రెగ్యులర్ పరీక్షల సెమిస్టర్ ఫీజులు 1400 నుంచి 1600 వరకు వసూలు చేస్తున్నారని,
ఫీజుల విషయంలో కాకతీయ యూనిర్సిటీకి, తెలంగాణ యూనివర్సిటీకి వ్యత్యాసం చాలా ఉందని పేర్కొన్నారు. ఫీజులు నిర్ణయించే అధికారం గిరిరాజ్ కళాశాలకు ఉందని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధిక మొత్తంలో ఫీజుల వసూలు చేయడం సరైనది కాదని, బ్యాక్ లాగ్ మరియు రెగ్యులర్ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎగ్జామ్ ఫీజు డేట్ పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు మనోజ్, విజయ్, సురేష్, జీవన్, వివేక్, డానియల్, కాశిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ హత్యకేసును తప్పదోవ పట్టించే యత్నం

**రాజమండ్రి:** తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి గడిచిన నాలుగైదు రోజులుగా అట్టుడికి పోతుందని మాజీ ఎంపీ, వైకాపా నేత మార్గాని భరత్‌రామ్ ఆరోపించారు. మహిళలపై వేధింపులు మానభంగాలు జరుగుతున్నాయి.. పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో మంత్రి లోకేష్ బాధ్యత రహితంగా ట్విట్ చేయటం దారుణం.. పోస్టుమార్టం రిపోర్ట్ బయటకు రాకుండానే యాక్సిడెంట్ అని ఎలా నిర్ధారించారని ప్రశ్నించారు. ఇది బాధ్యతారహిత్యం కాదా.. క్రైస్తవ సంఘాలు ఇది హత్య అని ఘోషిస్తున్నాయి.. అలాగే, ఫార్మసిస్ట్ అంజలి తన ఆత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు సూసైడ్ నోట్లో వెల్లడించింది.. బొల్లినేని కిమ్స్ ఎంజీఎం దీపక్ ట్రాక్ రికార్డు కూడా చాలా బ్యాడ్ గా ఉంది.. అమ్మాయిని కొట్టిన ఫోటోలు కూడా త్వరలో విడుదల చేస్తామని మార్గాని భరత్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని మార్గాని భరత్ ఆరోపించారు. సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతుంది.. అమ్మాయి ఏ ఇంజక్షన్ తీసుకుందో ఆ విషయాన్ని తల్లిదండ్రులకు మూడో రోజున తెలిపారు.. తన అవయవాలు దానం చేయాలని, తాను మళ్ళీ పుట్టాలనుకోవడం లేదని సూసైడ్ నోట్ లో బాధితురాలు రాసింది.. నిందితుడు దీపక్ దీన్ని తారుమారు చేసే ప్రయత్నం చేశాడు.. ఆస్పత్రిలో సీసీ టీవీ రికార్డులను పూర్తిగా బయట పెట్టండని ఆయన డిమాండ్ చేశారు. బాధితురాలికి, ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం.. ఈనెల 23న రాత్రి 11 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.. ఎఫ్ఐఆర్ డేట్ ను ఎందుకు మార్చారు.. ఇది అనేక అనుమానాలు తావిస్తుంది అని మార్గాని భరత్ రామ్ తెలిపారు. అయితే, హాస్పిటల్ మేనేజ్మెంట్ ను ఎందుకు ఎఫ్ఐఆర్ లో చేర్చలేదు అని మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. యువతి సూసైడ్ నోట్ దొరికిన తర్వాతే దీపక్ అబ్ స్కాండ్ అయ్యాడు.. దీపక్ తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి, అతని మామ రాజమండ్రిలో క్రియాశీలక నాయకుడు అని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందినవారు కనుక ఈ అంశాన్ని తారుమారు చేసే ప్రయత్నం జరుగుతుందని అనిపిస్తుంది.. ఈ వ్యవహారంలో రాజకీయాలకు తావులేదు.. బాధితురాలి కుటు-ంబానికి న్యాయం జరగాలని కోరారు. ఈ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే కూడా అనేక అబద్ధాలు చెబుతున్నారు.



# ఆ విషయం రజనీకాంత్ నుంచి నేర్చుకున్నా: శ్రుతి హాసన్




సినీప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో రజనీకాంత్ 'కూలీ' ఒకటి. ఈ సినిమాలో నటి శ్రుతిహాసన్ కీలకపాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రజనీతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గురించి శ్రుతి మాట్లాడారు. 'కూలీ' లాంటి భారీ బడ్జెట్ సినిమాతో పాటు తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రల్లో చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని శ్రుతి తెలిపారు.

"రజనీకాంత్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. అంతపెద్ద స్టార్‌గా ఎలా ఎదిగారో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు అర్థమైంది. ఆయన క్రమశిక్షణ, అంకితభావం, పాత్ర కోసం కష్టపడేతత్వం ఇలా ఎన్నో విషయాల్లో ఆయన్ని చూసి స్ఫూర్తిపొందాను. వినయంగా ఉంటారు. సెట్‌లో ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా పని చేస్తారు. ఆయన సెట్‌లో ఉంటే పాజిటివ్‌గా అనిపిస్తుంది. ఒక వ్యక్తిగానూ ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ముఖ్యంగా ఇతరులతో ఎలా వ్యవహరించాలో రజనీకాంత్‌ని చూసి తెలుసుకున్నా. 'కూలీ'లో నా పాత్ర చాలా సింపుల్‌గా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అవుతుంది. లోకేశ్ దర్శకత్వంలో వర్క్ చేయడం నా కల. అందుకే ఆయన ఈ సినిమా గురించి చెప్పగానే అంగీకరించాను. ఇలాంటి సినిమాల్లో విభిన్నమైన పాత్రలు ఉంటాయి వాటిని తెరపై చూపించడం నిజంగా సవాలే. లోకేశ్ వాటన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని దీన్ని తెరకెక్కించారు" అని శ్రుతిహాసన్ తెలిపారు.

# 'పెద్ది' చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తుంది



తన తనయుడు, నటుడు రామ్‌చరణ్ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రత్యేకంగా విషెస్ తెలిపారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. చరణ్ కొత్త సినిమా 'పెద్ది' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఉద్దేశించి ఆయన కామెంట్ చేశారు. పోస్టర్‌లో చరణ్ లుక్ చాలా అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. ఇది తప్పకుండా సినీ ప్రియులకు ఇది ఒక మంచి ట్రీట్ కానుందని ఆకాంక్షించారు. "హ్యాపీ బర్త్‌డే మై డియర్ చరణ్. 'పెద్ది' చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తుంది. నీలోని నటుడిని మరో కొత్త కోణంలో ఇది ఆవిష్కరించనుంది. అభిమానులకు ఇది కనులపండుగ కానుందని నమ్ముతున్నా" అని పేర్కొన్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో 'పెద్ది' సినిమా రూపొందుతోంది. బుచ్చిబాబు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీకపూర్ కథానాయిక. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది.




# RC 16 టైటిలిదే..'పెద్ది'

మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రోజు వచ్చేసింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న సినిమా RC16 నుంచి అప్‌డేట్ వచ్చింది. చరణ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ యూనిట్ ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి విషెస్ చెప్పింది. లాంగ్ హెయిర్.. గుబురు గడ్డంతో ఉన్న సరికొత్త లుక్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఇక ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ ఖరారు చేసినట్లు తెలిపింది.

స్పోర్ట్స్ నేపథ్యంలో ఈ సినిమా సిద్ధమవుతోందని టాక్. 'ఉప్పెన' తర్వాత సుమారు రెండేళ్లపాటు కష్టపడి బుచ్చిబాబు దీనిని సిద్ధం చేశారు. ఇందులో రామ్‌చరణ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండనుంది. జాన్వీకపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్‌తోపాటు జగపతిబాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. రెహమాన్ స్వరాలు అందిస్తున్నారు. ఇప్పటికే రెండు పాటలు పూర్తి చేశానని ఇటీవల రెహమాన్ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా దీనిని నిర్మిస్తున్నాయి.

# చెత్త సినిమాలు తీస్తే.. రిజల్ట్ చెత్తగానే ఉంటుంది

కొవిడ్ తర్వాత బాలీవుడ్‌లో సరైన విజయాలు నమోదైన దాఖల్లేవు. హిందీ సినిమాలు వరుసగా పరాజయం కావడంపై అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ స్పందించారు. 'సికందర్' ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. చెత్త సినిమాలు చేస్తే రిజల్ట్ చెత్తగానే ఉంటుందని అన్నారు. కథ మంచిగా ఉంటేనే విజయాలు అందుకుంటాయని ఆయన అన్నారు.

"సరైన చిత్రాలు తెరకెక్కించనప్పుడు అవి బాక్సాఫీస్ వద్ద తప్పకుండా పరాజయమే అందుకుంటాయి. నా సొంత చిత్రమే అయినా.. అది సరిగ్గా ఆడలేదంటే కారణం అది మంచి సినిమా కాదనే. బాక్సాఫీస్ వద్ద అది వర్కౌట్ అయిందంటే.. మంచి సినిమా అని అర్థం. సినిమా కోసం ఎంతోమంది కష్టపడతారు. అందరూ కలిసి వర్క్ చేస్తేనే సినిమా అవుతుంది. అయినప్పటికీ కేవలం నటుడి ఫొటోని మాత్రమే పోస్టర్లపై వేస్తారు. ప్రేక్షకులు కూడా అతడిని చూసేందుకు థియేటర్లకు వస్తారు. ఒకవేళ ఏదైనా సినిమా ఫ్లాప్ అయితే అందరూ ఆ హీరోనే తప్పుపడతారు. ఇప్పుడున్న రోజుల్లో సినిమాలు పరాజయం అందుకోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి.దర్శక-నిర్మాతలు పోటీ మీదనే దృష్టి పెడుతున్నారు. సినిమా అంటే ఇలా చేయాలి అని ప్రదర్శించడం కోసమే వారు సినిమాలు తీస్తున్నారు. అది కరెక్ట్ కాదు. ప్రేక్షకుల కోసం మనం సినిమాలు చేయాలి. వాళ్లకు వినోదాన్ని అందించేలా సినిమా చేయాలి. ప్రేక్షకులకు ఏమీ తెలియదనుకుంటే నీ పిచ్చితనమే అవుతుంది. ఓటీటీ రాకతో వాళ్లకు సినిమా గురించి అన్ని విషయాలు సులభంగా తెలుస్తున్నాయి. దర్శక – నిర్మాతలు కూడా సరైన కథలు లేకపోయినా సినిమాలు చేసేస్తున్నారు. అలా కాకుండా మన వద్ద మంచి కంటెంట్ ఉన్నప్పుడే గొప్ప చిత్రాలు తెరకెక్కించాలి" అని సల్మాన్ ఖాన్ హితవు పలికారు.



# అది నయం కావడానికి 9 నెలలు పడుతుంది

ఓవైపు వరుస సినిమా షూట్స్, మరోవైపు ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా గడుపుతున్నారు నటి రష్మిక . ఈ క్రమంలోనే ఆమె కొన్ని రోజులుగా ఇన్‌స్టాకు దూరంగా ఉంటున్నారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ తాజాగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సరదాగా బదులిచ్చారు. తన ఇష్టాయిష్టాలను పంచుకున్నారు. అదేవిధంగా ఇటీవల తన కాలుకు గాయం కావడం పైనా ఆమె మాట్లాడారు. తాను ఇప్పుడిప్పుడే ఆ గాయం నుంచి కోలుకుంటున్నానని తెలిపారు. "కాలు ఇప్పుడిప్పుడే నయం అవుతుంది. కానీ పూర్తిగా సెట్ కావడానికి ఇంకా 9 నెలల సమయం పడుతుంది. కాకపోతే ఇప్పుడు పరిస్థితి మెరుగుపడింది. వర్క్ లైఫ్‌లో ఫుల్ బిజీ అయిపోయా" అని ఓ అభిమానికి బదులిచ్చారు.






# ఆ విషయం నన్ను కదిలించింది

జపాన్ పర్యటనపై ప్రముఖ నటుడు ఎన్టీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. ఓ అభిమాని తెలుగు నేర్చుకోవడంపై ప్రత్యేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు."నేనెప్పుడు సందర్శించినా జపాన్ నాకు మంచి జ్ఞాపకాలు అందిస్తుంటుంది. కానీ, ఈసారి భిన్నంగా అనిపించింది. 'ఆర్ఆర్ఆర్' చూసిన తర్వాత తెలుగు నేర్చుకున్నానని ఓ జపనీస్ అభిమాని చెప్పడం నన్ను కదిలించింది. భాషలు, సినీ అభిమానిగా.. విభిన్న సంస్కృతులతోపాటు భాష నేర్చుకునేందుకు సినిమా దోహదపడుతున్నందుకు సంతోషిస్తున్నా. భారతీయ సినిమా ప్రపంచస్థాయిలో అభిమానుల్ని సొంతం చేసుకుంటుందనేందుకు ఇది మరో కారణం" అని పేర్కొన్నారు. తాను షేర్ చేసిన వీడియోలో.. అభిమానులకు ఆటోగ్రాఫ్ ఇస్తూ కనిపించారు.

జపాన్‌లో 'దేవర' ఈ నెల 28న విడుదల కానున్న నేపథ్యంలో ఎన్టీఆర్ మరోసారి అక్కడకు వెళ్లారు. ప్రమోషన్స్‌లో భాగంగా పలువురు అభిమానులను కలిశారు. ఇటీవల.. ఓ అభిమానితో కలిసి ఆ చిత్రంలోని 'ఆయుధ పూజ' పాటకు ఎన్టీఆర్ డ్యాన్స్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఎన్టీఆర్‌తోపాటు దర్శకుడు కొరటాల శివ కూడా వెళ్లారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కిన 'దేవర' గతేడాది విడుదలై, విజయం అందుకుంది. 'దేవర 2' తెరకెక్కించనున్నట్టు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి.